క్లుప్తంగా

పాదయాత్రతో తుల్జాపూర్ చేరుకున్న స్వాములు



తుల్జాపూర్ భవానీ మాత ఆలయానికి చేరుకున్న గొల్లకుంట తండా స్వాములు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గొల్లకుంట తండాకు చెందిన గిరిజనులు సేవాలాల్ దీక్ష చేపట్టారు. మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత దర్శనం కోసం వారం రోజుల క్రితం పాదయాత్రతో వెళ్లి శుక్రవారం చేరుకున్నారు. భవానీ మాతను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గొల్లకుంట తండాకు చెందిన శివరాం రాథోడ్, వెంకటేశ్, అనిల్, రాంసింగ్, అరవింద్, వికాస్, శ్రీను తదితరులు తరలి వెళ్లారు.

ప్రచారరథం అడ్డుకున్న మందాపూర్ గ్రామస్తులు



బీఆర్ఎస్ పార్టీ ప్రచార రథం తరిమివేస్తున్న గ్రామస్తులు

అల్లాదుర్గం(మెదక్): ఆటోకు మైక్, బీఆర్ఎస్ పార్టీ బ్యానర్లు కట్టుకొని పథకాలపై గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం అందోల్ అసెంబ్లీ నియోజకవర్గం అల్లాదుర్గం మండలం మందాపూర్ గ్రామానికి బీఆర్ఎస్ పార్టీ ప్రచార రథం రావడంతో స్థానికులు అడ్డుకున్నారు. మా గ్రామంలో ఎందుకు ప్రచారం చేస్తున్నావ్, వెంటనే వెళ్లి పోవాలని అడ్డుకొని గ్రామం నుంచి తరిమి వేశారు. గ్రామానికి రోడ్డు దారుణంగా ఉందని, దళిత బంధు పార్టీ కార్యకర్తలకే ఇచ్చారని, గృహలక్ష్మి పథకం సహితం పార్టీ నాయకులే రాసుకున్నారని పలువురు దళితులు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రచార రథం తరిమికొట్టడంతో పాటు విడియో తీసి వాట్సప్, సోషల్ మీడియాలో పెట్టి విస్తృత ప్రచారం చేశారు.

సవాల్ స్వీకరణ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

నిజాంపేట(మెదక్): మండలంలోని నందిగామ గ్రామంలో పంపిణీ చేసిన డబుల్ బెడ్రూం ఇళ్లలో అవకతవకలు జరగలేదని సవాల్ విసిరిన బీఆర్ఎస్ నాయకుల సవాల్‌ను బీజేపీ నాయకుడు, నిజాంపేట జెడ్పీటీసీ విజయ్‌కుమార్ శుక్రవారం స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం నందిగామ గ్రామంలోకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ ఇళ్లలో పనులు పూర్తి కాకుండానే పంపిణీ చేశారన్నారు. కనీస సౌకర్యాలు లేవని వాటిని త్వరలో పరిష్కారించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, ఆకుల రమేశ్, బాజ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటలపై అవగాహన



మాట్లాడుతున్న సెహగల్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో టమాట పంటల నిర్వహణపై సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టమాట పంటలను పండించడంలో పాటించే మెళకువలను తెలియజేశారు. విత్తనాల ఎంపికలో జాగ్రతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విజయ్, అఖిల్ మహిళా రైతులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు గుర్తింపు లేదు

అల్లాదుర్గం(మెదక్): బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి నిరంతరం కృషి చేసిన మండలంలోని ఉద్యమకారులకు గుర్తింపు లేదని ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చిల్వెర ఐబీ చౌరస్తాలో ఉద్యమకారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సేవలు వినియోగించుకొని ఎమ్మెల్యేలుగా ఎన్నికై తమను పట్టించుకోవడం లేదని చెప్పారు. మరోసారి సమావేశం పెట్టుకొని వచ్చే ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలో నిర్ణయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రాథోడ్, విస్లావత్ గోపాల్, మూసా, మచ్చేందర్, రియాజ్, గోప్యానాయక్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అదరహో..

- జిల్లాలో రెండు పాఠశాలల్లో అమలు
- దసరా సెలవుల అనంతరం అన్ని పాఠశాలల్లో



చిన్నగొట్టిముక్ల పాఠశాలలో అల్పాహారం తింటున్న విద్యార్థులు



అల్పాహారం పరిశీలిస్తున్న రాష్ట్ర పరీక్షల సంచాలకులు కృష్ణారావు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న అల్పాహారం పథకం (సీఎం బ్రేక్ ఫాస్ట్)కు మంచి స్పందన వస్తుంది. జిల్లా కేంద్రం మెదక్ బాలికల పాఠశాల, శివ్వంపేట మండల చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 6న అల్పాహార పథకం ప్రారంభించారు. దసరా సెలవుల అనంతరం అన్ని ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం అమలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న అల్పాహారం పథకాన్ని రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పరిశీలించి, పలు సూచనలు చేస్తున్నారు. డీఈఓ రాధాకిషన్ గురువారం అల్పాహారం పరిశీలించారు.

ఉత్సాహంగా విద్యార్థులు

ఉదయం వేళల్లో పలు ఇళ్లలో టిఫిన్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఖాళీ కడుపుతో పాఠశాలలకు హాజరు అయ్యేవారు. కానీ ఇప్పుడు అల్పాహారం పెడుతుండడంతో ఉత్సాహంగా పాఠశాలలకు వస్తున్నారు.

పెరిగిన హాజరు శాతం

ఉదయం అల్పాహారం ఇస్తుండడంతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరిగింది. గతంలో ప్రార్థన సమయంలో 60 శాతం ఉంటున్న విద్యార్థులు బ్రేక్‌ఫాస్ట్ వల్ల మరో 20 శాతం పెరిగింది. రానున్న కాలంలో 100 శాతం విద్యార్థులు పాఠశాలకు తప్పకుండా హాజరయ్యే అవకాశం ఉంది. చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాలలో 165 మంది, ప్రాథమిక పాఠశాలలో 45 మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామం నుంచే కాకుండా సమీప గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థులకు ఈ అల్పాహారం వరంగా మారింది. ప్రస్తుతం అక్షయపాత్ర ద్వారా అల్పాహారం అందిస్తున్నారు. ఉదయం అల్పాహారం, ఇంటర్వెల్ సమయంలో రాగిజావా, మధ్యాహ్న భోజనంతో విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంది.

టిఫిన్ బాగుంది



మా గ్రామం నుంచి పాఠశాల 6 కిలో మీటర్ల దూరంలో ఉంది. దీంతో ఉదయం వేళలో టిఫిన్ చేసేందుకు వీలు కాకపోతుండే. ప్రస్తుతం పాఠశాలలో అందిస్తున్న టిఫిన్ బాగుంది. రోజుకో వెరైటీరుచికరంగా ఉండడంతో ఇష్టంగా తింటున్నాం.

– గీతిక, విద్యార్థిని, 10వ తరగతి

అన్ని పాఠశాలల్లో..

దసరా సెలవుల అనంతరం జిల్లాలోని 897 ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు సంబంధించి ఉన్నత అధికారులు సూచించే విధి విధానలతో మోను ప్రకారం అల్పాహారం అందిస్తాం.

– రాధాకిషన్, డీఈఓ

రెండో రోజు బతుకమ్మ ఉత్సవాలు



శివ్వంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చేగుంట హనుమాన్ వీధిలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో రెండో రోజు బతుకమ్మ ఉత్సవాలను శుక్రవారం జరుపుకొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పలు గ్రామాల్లో చిన్న బతుకమ్మ వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి.

ఇంటి ముఖం పట్టిన విద్యార్థులు

నర్సాపూర్: పాఠశాలలకు శుక్రవారం నుంచి ప్రభుత్వం దసరా సెలువులు ప్రకటించడంతో పట్టణంలోని పలు ప్రభుత్వ వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు శుక్రవారం ఇంటి ముఖం పట్టారు సెలవులు రావడంతో వారి తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లల లగేజీ సర్దుకొని వారిని ఇంటికి తీసుకెళ్లారు.



నర్సాపూర్‌లోని ప్రభుత్వ వసతి గృహాల నుంచి తమ లగేజీతో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

హిందూ పరిరక్షణ ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న ప్రతినిధులు



వెల్దుర్తిలో యాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో శుక్రవారం హిందూ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా చేపట్టారు. కార్యక్రమంలో ఆనంద్‌రావు, వంజరి శ్రావణ్, వడ్ల అనిల్, రాకేశ్ గణేశ్, శ్రీకాంత్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శౌర్య జాగరణ యాత్ర

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ శౌర్య జాగరణ యాత్రను హనుమాన్ దేవాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహానికి విభాగ్(ఉమ్మడి మెదక్ జిల్లా) కార్యదర్శి మల్లేశం, జిల్లా సహ కార్యదర్శి ప్రభాకర్‌లతో పాటు విశ్వహిందూ పరిషత్ నాయకులు ప్రత్యేక పూజలు చేసి వాహనంలో అధిష్ఠించారు. కార్యక్రమంలో గజం చంద్రకాంత్, పోచయ్య, శేఖర్‌గౌడ్, గణేశ్ పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మండలంలోని కాళ్లకల్ గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద పూజలు చేసి శౌర్య జాగరణ యాత్ర ప్రారంభించారు. యాత్రకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గోపాల్, మల్లేశ్, నరేదర్‌చారి, నాగరాజు, ముకేశ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో ఈనెల 15 నుంచి శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ఆయా గ్రామాల్లోని ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను ప్రారంభించారు. శుక్రవారం రంగంపేట హనుమాన్ మందిర్ వద్ద గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు, శాశ్వత చందాదారుల ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించి 19 వసంతాలు అవుతున్నాయి. 23 వరకు జరిగే ఈ ఉత్సవాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పేర్కొన్నారు.



ఉత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న సభ్యులు

భూసార పరీక్షలు తప్పనిసరి

నర్సాపూర్ రూరల్: పంటలు సాగు చేసుకునే ముందు మట్టి నమూనా స్వీకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలని కొడిపల్లి మండలంలోని తునికిలోని డి. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పెద్దచింతకుంటలో రైతులకు భూసార పరీక్షలు, సమగ్ర సస్యరక్షణ, సేంద్రియ, రసాయన ఎరువుల వినియోగం, క్రిమిసంహారక మందుల ద్వారా లాభనష్టాలపై అవగాహన కల్పించారు. ప్రతీ రైతు పంటలు సాగిస్తున్న ముందు తమ భూముల నుంచి మట్టిని సేకరించి భూసార పరీక్షలు చేయించుకొని పరీక్షల రిపోర్టుకు ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి, సేంద్రియ ఎరువులతో పంటలు సాగు అధిక దిగుబడులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ కోర్స్ విద్యార్థులు, సర్పంచ్ గుండె శివకుమార్, ఉపసర్పంచ్ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.



పెద్దచింతకుంటలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

అందుబాటులో వైద్యసేవలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పల్లె దవాఖానా ఏర్పాటుతో స్థానిక ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో ఏర్పాటు చేసిన పల్లె దవఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఏర్పడిన పల్లె దవాఖానాను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని, త్వరలోనే పూర్తి స్థాయిలో మందులు రావడంతో పాటు, పలు రకాల వైద్య పరీక్షలు చేసేందుకు సామగ్రి సైతం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యమంలో హెల్త్ సెక్రెటరీ సృజన, ఏఎన్ఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడి

ముగ్గురిపై కేసు నమోదు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ దేవి ఆలయం వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మూడు దుకాణాలపై టాస్క్‌పోర్స్ సిబ్బంది, పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా పలు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని షాపులు నిర్వహిస్తున్న నర్సాగౌడ్, భిక్షపతి, రాజాగౌడ్‌లపై కేసులు నమోదు చేశామన్నారు.

కాంగ్రెస్ పథకాలపై ప్రచారం

అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టనున్న ఆరు పథకాలపై శుక్రవారం అల్లాదుర్గంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సదానందం, మధు, పాండు, నాగిశెట్టి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు ఇవ్వాలి

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలను చెల్లించాలని కార్మికుల సంఘం జిల్లా నాయకుడు అసీఫ్ అన్నారు. శుక్రవారం రోజున పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎంపీఓ సతీశ్‌కు వినతిపత్రం అందించారు. మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పండగలు వస్తున్నందున అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్మికులకు వేతనాలు అందించాలని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో కార్మికులు వీరేశ్, స్వామి, అంజయ్య, రమేశ్, లక్ష్మి, నవనీత, బాలమణి, నర్సమ్మ, ఎల్లమ్మ తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీ కొన్న అంబులెన్స్

తండ్రి కూతురికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటర్ చదువుతున్న కూతురును పండగ సెలవులు రావడంతో హాస్టల్ నుంచి బైక్‌పై తండ్రి తీసుకొస్తుండగా అంబులెన్స్ ఢీకొని తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని అంబాజీపేటలో చోటు చేసుకుంది. శుక్రవారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం మాల్ తుమ్మెద గ్రామానికి చెందిన బోయిని యాదగిరి గజ్వేల్ హాస్టల్‌లో ఉండి ఇంటర్ చదువుతున్న కూతురు నందిని ఇంటికి తీసుకొస్తున్నాడు. మండలంలోని అంబాజీపేట దుర్గమ్మగుడి వద్దకు రాగానే ఎదురుగా రాంగ్ రూటోలో వచ్చిన అంబులెన్స్ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యాదగిరి, నందినికి కాల్లు విరగడంతో 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం గమనించిన సర్పంచ్ కుమారుడు రామకృష్ణ దగ్గర ఉండి వారిని ఆస్పత్రికి తరలించారు. కాగా అంబులెన్స్ డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేసినట్లు పోలీస్‌లు గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

ఆటో బైక్ ఢీ

కౌడిపల్లి(నర్సాపూర్): ఆటో, బైక్ ఢీ కొనడంతో తండ్రి కొడుకులకు గాయాలైన సంఘటన కౌడిపల్లి మండలం వెల్మకన్న వద్ద శుక్రవారం జరిగింది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. కౌడిపల్లి గ్రామానికి చెందిన పొన్నం మనోహర్‌గౌడ్, అతని తండ్రి బాలగౌడ్‌తో కలసి బైక్‌పై వెల్దుర్తి వెళ్లి తిరిగి కౌడిపల్లి వస్తున్నారు. లింగంపల్లి తండాకు చెందిన వ్యక్తి తన ఆటోలో కౌడిపల్లి నుంచి వెల్మకన్న కు వెళ్తుండగా.. శివారులో ఆటో, బైక్ ఢీ కొనడంతో మనోహర్‌గౌడ్, అతని తండ్రి బాలగౌడ్‌కు గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): రాయపోల్ మండలంలోని రామారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు చేగుంటలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. శుక్రవారం బీజేపీలో చేరిన వారిలో వార్డుమెంబర్ నర్సయ్య, ఎల్లయ్య, కిష్టవ్వ కిషన్, స్వామి, మత్స్యశాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, రెడ్డిసంఘం నాయకులు కిష్టారెడ్డి, యాదగిరి, ఎల్లం, స్వామి, వెంకటేశ్, రాజిరెడ్డి, సత్తయ్య, యాదయ్య, పరశురాం తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ బీజేపీ మండల శాఖ నాయకులు వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, మంకిడి స్వామి, తలారి నర్సింలు, సర్పంచ్ అంజనేయులు, సత్యపాల్‌రెడ్డి, గోపాల్, చంద్రారెడ్డి, మహేశ్, నరేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

రోడ్డుపై 'సీసీ'

పనులను అడ్డుకున్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఉన్న సీసీరోడ్డుపై మరో సీసీ రోడ్డు వేస్తుండడం, దీనికి తోడు వ్యవసాయ పట్టా భూమిలో సీసీ రోడ్డు వేస్తున్నారంటూ గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం అధికార పార్టీ నాయకుడిని ఇంటి ఎదుట సీసీ రోడ్డు ధ్వంసమైందని, మరోసారి సీసీరోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించారు. కాలనీకి చెందిన పలువురి ఇళ్లలో నుంచి మురికి నీరు పోయేందుకు పైపులు ఏర్పాటు చేసి కింద ఉన్న పొలాల్లోకి వేశారు. దీంతో పొలం యజమానులు నర్సింలు, ఎల్లయ్య కాంట్రాక్టర్‌తో పాటు, అధికార పార్టీ నాయకుడితో గొడవ పడ్డారు. అనంతరం గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. ఈ విషయమై పీఆర్ఏఈ ప్రభాకర్‌ను వివరణ కోరగా.. గ్రామానికి రూ. 3 లక్షలు మంజూరు కావడంతో సీసీ రోడ్డు వేస్తున్నారని, గ్రామస్తులు పనులు అడ్డుకోవడంతో ఆపేశామన్నారు.



పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

పార్టీ జెండాలు, ఫ్లెక్సీల తొలగింపు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎన్నికల నియమావళి ప్రకారం ఏ పార్టీ నాయకులైన పార్టీ జెండాలను, ఫ్లెక్సీలను బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయరాదని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. శుక్రవారం ఆమె, ఎస్ఐ షేక్‌మహబూబ్‌తో కలసి మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో ఓ పార్టీ కార్యాలయం ఆవరణలో ఉన్న పార్టీ జెండాను, ఫ్లెక్సీలను తొలగింపజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రాజీనామా

పాపన్నపేట(మెదక్): మండల టీడీపీ అధ్యక్ష పదవికీ రాజీనామా చేస్తున్నట్లు శాషెద్ పాషా ప్రకటించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

◆ ముప్పిరెడ్డిపల్లిలో వైద్య శిబిరం

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు.

◆ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికల జోరు కొనసాగుతోంది. తాజాగా శుక్రవారం బీఆర్ఎస్ నుంచి నాలుగు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. వీరికి మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆదేశించారని మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావ్ తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ సభ్యుడు యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు చోటుమియా, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావ్ కులకర్ణి, పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, నాయకులు పాల్గొన్నారు.

◆ అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

చేగుంట(తూప్రాన్): గ్రామాల్లోని పలువురు కిరాణ షాపుల నిర్వాహకులు అమ్మడానికి అక్రమంగా దాచిన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హరీశ్ తెలిపారు. గురువారం రాత్రి అనంతసాగర్ గ్రామంలో వడ్ల నవీన్ కిరాణ షాపుతో పాటు ఉల్లితిమ్మాయిపల్లి గ్రామంలో రఘుపతి, రవీందర్, రాజుల కిరాణ దుకాణాల్లో విక్రయించడానికి ఉంచిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ ఆశ్రమానికి వంట పాత్రలు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామ పరిధిలో ఉన్న బేతని సంరక్షణ ఆశ్రమానికి దాతలు శుక్రవారం వంట పాత్రలు అందజేశారు. మేడ్చల్ జిల్లా షామీర్‌పేటకు చెందిన హైదరాబాద్ బ్యాటరీ పవర్ సిస్టం లిమిటెడ్ వారు రూ.25 వేల విలువ గల వంట పాత్రలను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాఘవేందర్‌రెడ్డి, రాఘునాథ్ తదితరులు ఉన్నారు.

◆ ముమ్మరంగా వాహనాల తనిఖీ

వెల్దుర్తి(తూప్రాన్): ఎన్నికల కోడ్ నేపథ్యంలో వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ముమ్మరంగా తనిఖీ చేశారు. శుక్రవారం నర్సాపూర్ చౌరస్తా వద్ద ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో పాటు పలు వాహనాలను తనిఖీ చేశారు.

◆ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ముసాద్దిక్ ఆధ్వర్యంలో శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముసాద్దిక్ మాట్లాడుతూ.. 73 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది సంధ్య, అరుణ్ పాల్గొన్నారు.

◆ తండాలో పూజలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని నంగాయిపేట గిరిజన తండాలోని భీమ్లా నాయక్ తండాలో శుక్రవారం భవాని మాత, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో భవాని మాత దీక్ష దారులు మహా బోగ్ బండార్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ అందరూ చూడదగిన చిత్రం

మెదక్ మున్సిపాలిటీ: ఉపాధ్యాయ వృత్తి జీతం కోసం కాకుండా విద్యార్థుల జీవితాలను మెరుగుపరిచేలా ఉండాలని సినిమాల్లో చూపించడం చాలా అద్భుతంగా ఉందని తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ వ్యాప్తంగా రిలీజ్ అయిన నీతోనే నేను సినిమా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు చూడదగినదని తెలిపారు. మెదక్ జిల్లా వాసి మామిడి సుధాకర్ రెడ్డి నిర్మాతగా నిర్మించిన నీతోనే నేను సినిమా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సత్సంబంధాలను వివరించారని తెలిపారు. కార్యక్రమంలో మాధవారెడ్డి, అంజగౌడ్, సందీప్‌రెడ్డి, సాయిలు, ప్రవీణ్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్, సతీశ్, శ్రీనివాస్ రావు, రమేశ్ పాల్గొన్నారు.

◆ మురళీకృష్ణ ఆలయంలో చోరీ

పాపన్నపేట(మెదక్): మండలంలోని నాగ్సాన్‌పల్లి శివారులోని మురళీకృష్ణ ఆలయంలో చోరీ జరిగిందని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆలయంలో పనిచేసే రాజయ్య యథావిధిగా శుక్రవారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లే సరికి తలువులు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూస్తే మురళీ కృష్ణుడి ఉత్సవ విగ్రహం, ఇత్తడి శఠగోపం, ఇత్తడి తాంబాళం కనిపించలేదు. పోలీసులకు సమాచారం తెలపగా కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

◆ రాజన్నరాజ్యం వైఎస్సార్ టీపీతోనే..

టేక్మాల్(మెదక్): రాష్ట్రంలో రాజన్నరాజ్యం వైఎస్సార్ టీపీతోనే సాధ్యమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ తెలిపారు. శుక్రవారం టేక్మాల్‌లో మాట్లాడుతూ ... రాష్ట్ర వ్యాప్తంగా పోటీకి సిద్ధమని, పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు.